thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

**విజృంభించిన రాజస్థాన్**



11

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 22 | కరీంనగర్ | బుధవారం | 8 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

# దొరగడిలను తడుతున్న 'కర్రకుర్చీ సారు'

(కట్టా నరేంద్రాచారి,సీనియర్ జర్నలిస్ట్)



కర్ర కుర్చీలకు కాలం చెల్లిపోయి చాలా ఏళ్లు గడిచాయి అనుకుంటాం కానీ,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి చూస్తే 40 ఏళ్ల క్రితం నాటి టేకు కర్ర కుర్చీలు, కర్రలతో చేసిన బల్లలు దర్శనం ఇచ్చాయి.రాజకీయాలలో ఫైర్ బ్రాండ్..కానీ నిజజీవితంలో సాదా సీదాగానే ఉంటున్న ఆయన విద్యార్థి దశగా ఉన్నప్పుడే ఆయన తిరుగుబాటు స్వభావం కలిగిన వ్యక్తి.దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన జీవన్ రెడ్డి డాంబిక జీవితానికి దూరం.అలాంటి జీవన్రెడ్డి తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు ఇప్పుడు చర్చనీ అంశంగా మారాయి .ఆదిపత్య వర్గ రాజకీయాలను ఎండగట్టే స్వభావం కలిగిన..ఆయన ఎటువైపు వెళుతున్నారు ? దొరగడికి వ్యతిరేక స్వభావం ఉన్న నాయకుడు నయా దొరగడి తలుపు తడుతున్నారు.ఉత్తర తెలంగాణలో జీవన్ రెడ్డి నిర్ణయాల మీద

ఒక చర్చ కు దారి తీస్తుంది.టిఆర్ఎస్ గూటికి వెళ్తే ఏం జరగబోతుంది కేసీఆర్ వద్దకు వెళ్లిన వారంతా చివరికి వారి రాజకీయ ముగింపు ఎలా సాగింది? అనే కోణంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రాజకీయ విశ్లేషకులు జీవన్ రెడ్డి, కెసిఆర్ జంటపై ,జత కట్టడంపై చర్చించుకుంటున్నారు .ఒక టైగర్ నరేంద్ర, ఒక డిఎస్ పిసిసి అధ్యక్షుడు సక్సెస్ కెసిఆర్ వద్దకు వెళ్లి న తర్వాత ఏమయ్యారు.మరో పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఇప్పుడు ఎక్కడున్నారు?కోదండరాం సార్ కేశవరావు లాంటివారు చివరికి గద్దర్ లాంటి మహానుభావుడికి గేట్ దగ్గర పడిగాపులు..అందేశ్రీ ఏమయ్యారు ?బోరున విలపించలేదా?వీరే కాకుండా అనేక మంది కేసీఆర్ గూటికి వెళ్లిన వారి కథ ఏమైంది ముగింపు ఎలా సాగింది !వందలాది మంది రాజకీయ నాయకులకు కెసిఆర్ తమ చేతులతో కండువా కప్పిన తర్వాత వారిని ఏం చేశారు.ఇవి అన్ని తెలిసిన జీవనరెడ్డికళ్ల ముందు మునిగిన వారి కథలు తెలిసి,తెలిసి ఇదేమి అంటున్నవారు ఉన్నారు.యువకుడిగా ఎదురు దెబ్బలు తిన్న తర్వాత నాయకుడయ్యారు.జీవన్ రెడ్డి న్యాయవాద వాద వృత్తి చేస్తున్న సమయంలో పీపుల్స్ వార్ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆ పార్టీ కవర్ సంఘం ఉన్న పౌర హక్కుల సంఘంతో కలిసి ఉండేవారు .1982లో జరిగిన అంకం నారాయణ ,వాసం గజేందర్ ..పెద్దపల్లిలో బయ్యపు దేవేందర్ రెడ్డి లాంటి వారి ఎన్కౌంటర్లపై జార్జ్ పెర్నేజ్, కన్నాబీ రాన్ లు వచ్చిన సమయంలో ఆ నిజ నిర్ధారణ కమిటీ వెంట జీవన్ రెడ్డి ఉండి అనేక విషయాలను బయట ప్రపంచానికి తెలియజేశారు .అప్పుడే తెలుగుదేశం పార్టీ పుట్టుక రావడం జిల్లాలో ప్రధానంగా జగిత్యాల ప్రాంతంలో జీవన్ రెడ్డి హవా కొనసాగడం ఇదంతా ఎన్టీఆర్ను ఆకర్షించింది. స్వయంగా ఎన్టీ రామారావు నక్సలైట్లు దేశ భక్తులు అన్నట్టు గానే జీవన్ రెడ్డిని టిడిపికి ఆహ్వానించి జగిత్యాల నుంచి టికెట్ ఇచ్చి గెలిపించారు .జగిత్యాల ప్రాంతంలో ని జీవన్ రెడ్డి రాజకీయాలలో నిజాయితీపై ఎవరికి డౌట్ లేదు ముమ్మాటికి ఆయన నిస్వార్థపరుడే .ఇదే సమయంలో ఆయన నిక్కచ్చి నాయకుడిగా పేరు ఉన్నది. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ నుండి తెగ తెంపులు చేసుకొని బీ ఆర్ఎస్ పార్టీకి వెళితే అక్కడ కెసిఆర్ దొరపోకడల భరించి ఇమడగలుగుతారా అనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా ,ప్రశ్నార్ధకమవుతుంది .కేసీఆర్ రాజకీయ ఎత్తుగడాలన్నీ కండువా కప్పి 'ఎంగిలి చేసే 'విధంగా కొనసాగుతున్నాయి.ఇప్పుడు జీవన్ రెడ్డిని కూడా గులాబీ కండువా వేసి ఎంగిలి చేస్తే... దీర్ఘకాలం ఆయన అందులో కొనసాగుతారా టైగర్ నరేంద్ర వలె విజయశాంతి వలె ధర్మపురి శ్రీనివాస్ వలే ఈ జాబితాలో 100 మంది తర్వాత జీవన్ రెడ్డి తిరిగి చేరిపోతారా?మళ్లీ యుటర్న్ తీసుకుంటారనేది ఇప్పుడే ఈ అంశంపై ఇప్పుడే మాట్లాడుకుంటున్నారు .స్వతగా జీవన్ రెడ్డి విద్యార్థి దశలో మావోయిస్టు పార్టీ చీఫ్ లక్ష్మణరావు కు బ్యాచ్ మెంట్ కావడం ఆయన గ్రామం బతికే పెల్లి పూర్తిగా ఫ్యాక్షన్ మాదిరిగా రగిలిపోయి ఉండేది.ఆ చరిత్రలో జీవన్ రెడ్డి ది ఓ పేజీ ఉన్నది.అట్లాంటి ఆత్మగౌరవం నిక్కచ్చితనం కలిగిన జీవన్ రెడ్డి వెలమదొర గూటిలో ఫామ్ హౌస్ నుండి బయటికి రాని కెసిఆర్ గేట్ దగ్గర నిలబడి ఎంతకాలం జర్నీ చేస్తారు .రెడ్డిని కాదు తాను బీసీ అని చెప్పుకునే జీవన్ రెడ్డి గడి దొర సోపతి ఎంత కాలం ఉంటుందో చూడాల్సిందే

# ఇరాన్ అంతం ఖాయం



- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

3

# రెడ్ లైన్స్ దాటొద్దు


- అమెరికాకు తలుపులు మూసేసిన ఇరాన్
- తమ ఇంధన వనరులపై దాడి చేస్తే బాబ్-అల్-మండేబ్ మూసేస్తామని హెచ్చరిక

3



# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు.

4

# రాబోయే 48 గంటలు గడపదాటొద్దు

## ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్

- ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ
- ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం

2



# కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ

## విజయన్, మోడీ మంచి మిత్రులు



## రేవంత్‌తో నాకేం పని?

- తెలంగాణ నేతలే సమాధానం చెప్తారు
- పినరయి ఘాటు వ్యాఖ్యలు!

2

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డీఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

కేరళలో పినరయి విజయన్, ఢిల్లీలో నరేంద్ర మోదీ ఇద్దరూ 'పొలిటికల్ బ్రదర్స్' అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ సూచనల మేరకే కేరళలో పాలన సాగుతోందని, కేంద్రంలోని కేసుల నుండి తప్పించుకోవడానికే విజయన్ అగ్రనేతలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు.

**తిరువనంతపురం, ఏప్రిల్ 7 :** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి

మిగతా 2 లో




## రాబోయే 48 గంటలు
# గడపదాటొద్దు

### ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్
### ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ
### ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం

**ఢిల్లీ:** ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఓ నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు తీవ్ర హెచ్చరిక జారీ చేయడం పట్ల భారత కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీ చేసిన సలహాలో పలు కీలకమైన సూచనలు ఉన్నాయి. "తదుపరి 48 గంటల పాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారు పై అంతస్తుల్లో ఉండవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 7-8 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ రాత్రికి ఇరాన్ జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని కూడా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈ-మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది. పరిస్థితి వేగంగా మారే అవకాశం ఉన్నందున, పౌరులందరూ అధికారిక ప్రకటనలను నిరంతరం గమనిస్తూ ఉండాలని విజ్ఞప్తి చేసింది.

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

### పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యాపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోకపోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.



# కేరళలో కాంగ్రెస్ సునామీ ఖాయం

మొదటి పేజీ తరువాయి

మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు.



కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరఫున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# రేవంత్‌తో నాకేం పని?

### తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా

**తిరువనంతపురం, ఏప్రిల్ 7:** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ' మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసులుబాటు
- మావోయిస్టు అడ్డాల్‌ఓ అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

**ములుగు, ఏప్రిల్ 7:** తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం, సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో, టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.



# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

### 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.





# దేశానికే దిక్సూచి తెలంగాణ ఆడిట్ మోడల్!

- ఆడిటింగ్‌లో హ్యాట్రిక్ సాధించడం గర్వకారణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సచివాలయంలో కలిసిన గుజరాత్ ఆడిట్ బృందం

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆన్లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం ప్రభుత్వ పారదర్శకతకు, సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను గుజరాత్ రాష్ట్ర ఆడిట్ శాఖ ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ఆడిటింగ్ విధానాలను ఆయన వారికి వివరించారు. తెలంగాణ ఆడిటింగ్ విధానాలను, ఇక్కడి ఆన్లైన్ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వచ్చిన గుజరాత్ బృందం రాష్ట్ర ప్రగతిని అభినందించింది. మన రాష్ట్రంలోని ఉత్తమ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ మోడల్ పాలనను పరిశీలించేందుకు వచ్చే ఇతర రాష్ట్రాల బృందాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఇక్కడి సాంకేతిక పరిజ్ఞానం, ఆడిటింగ్ ప్రక్రియలో పాటిస్తున్న వేగం తమకు ఎంతో నచ్చిందని గుజరాత్ ప్రతినిధులు పేర్కొన్నారు. సాంకేతికతను జోడించి ఆడిటింగ్ ప్రక్రియలో జవాబుదారీతనం పెంచడం వల్లే ఈ అరుదైన విజయాలు సాధ్యమవుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నిధుల వినియోగంలో పక్కాగా ఆడిటింగ్ నిర్వహించడం ద్వారా ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న ఈ విధానాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, పారదర్శకతలో రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఆటో గ్యాస్ కష్టాలకు చెక్!

## కొరత లేకుండా చూడాలి.. కంపెనీలకు కమిషనర్ ఆదేశం

## 17 బంకులు మళ్ళీ షురూ.. పనితీరుపై స్టీఫెన్ సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ఆటో ఎల్పీజీని నిరంతరాయంగా తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. ఈ క్రమంలోనే మూతపడిన 17 బంకులను మళ్ళీ తెరిపించినట్లు పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి మూతపడిన బంకులను పునఃప్రారంభించడంలో సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు. అయితే పనితీరు ఏమాత్రం మెరుగుపరుచుకోని పలు కంపెనీల పట్ల స్టీఫెన్ రవీంద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి అన్ని బంకుల్లో సరఫరా చేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే గ్యాస్ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టామని వెల్లడించారు. బంకులకు వస్తున్న గ్యాస్ లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతిరోజు పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

# మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

## నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ

**ఇంఫాల్, ఏప్రిల్ 7:** మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మొయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.



# గ్యారెంటీలు ఏవీ? రేవంత్‌పై హరీష్ ఫైర్!

- పరిగిలో భూముల దోపిడీపై ధ్వజం
- అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- తమ్ముడి కోసం రైతుల భూములా?
- రేవంత్ ఓ రావణాసురుడు: హరీష్ రావు
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. తొమ్మిది వందల రోజులైనా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో భూములు కోల్పోతున్న రైతులను పలకరించేందుకు వెళ్తున్న హరీష్ రావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. రేవంత్ సర్కార్ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత

పరిగికి వెళ్తున్న హరీష్ రావు కాన్వాయ్ ను అప్పా జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లారీలను అడ్డంగా పెట్టి నేతలను నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును అరెస్ట్ చేసి శంషాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసు నిర్బంధాల మధ్యే రైతులకు అండగా పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

### పేద రైతుల భూములపై కన్ను

పరిగిలో ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని సీఎం తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ పాలనను రాక్షస పాలన, గడీల పాలనగా అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలి కానీ రైతుల పొట్ట కొట్టడం ఏంటని నిలదీశారు. ప్రభుత్వం చేసేది అంతా బోగస్ పాలన అని ఎద్దేవా చేశారు.

### అరెస్టులతో అణచలేరు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించేందుకు కూడా అనుమతించకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా రాదని జోస్యం చెప్పారు. మళ్ళీ కేసీఆర్ నాయకత్వంలో రామరాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రశ్నించే గొంతులను నొక్కడం దుర్మార్గం

- ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూముల కబ్జా
- బీఆర్ఎస్ నేతల అరెస్ట్ పిరికిపంద చర్య
- హామీలు పక్కనపెట్టి పేదల భూములపై కన్నేస్తారా?
- భూ దందాపై కేటీఆర్ ఫైర్!
- నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 7:** ప్రశ్నించే గొంతులను పోలీసు బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి, పేదల భూములపై పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అరెస్టులు పిరికిపంద చర్య

బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న నేతలను అక్రమంగా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూసేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు.

### దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నారు

కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడరని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద రైతుల ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం విశ్రమించదని కేటీఆర్ తేల్చి చెప్పారు.

# ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మ్యూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్




**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మ్యూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# రెడ్ లైన్స్ దాటొద్దు

- అమెరికాకు తలుపులు మూసేసిన ఇరాన్

**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 7:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటు ఇరాన్ మధ్య జరుగుతోన్న సవాళ్లు, ప్రతి సవాళ్లతో యుద్ధభూమి మరింత వేడెక్కింది. హర్మ్యాజ్ జలసంధిని తెరవడానికి ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రరాజ్యంతో జరుగుతున్న సంప్రదింపులు, శాంతి చర్చలకు తలుపులు మూసేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వ పత్రిక టెహ్రాన్ టైమ్స్ సోషల్ మీడియాలో ప్రకటన చేసింది. "అమెరికాతో ఉన్న అన్ని దౌత్య, పరోక్ష సంప్రదింపులు, చర్చల మార్గాల నుంచి ఇరాన్ వైదొలగింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడిని కూడా ముగించింది" ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించింది. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందన్న ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ దీటుగానే కౌంటర్ ఇచ్చింది. అమెరికా, దాని మిత్రులు కూడా తమ దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూస్తాయని హెచ్చరించింది. ఈ క్రమంలోనే పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో జరుగుతున్న చర్చలకు ఇరాన్ ముగింపు పలికింది. తమ 'రెడ్ లైన్స్' (హద్దులు) దాటితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, తమ స్పందన పశ్చిమాసియా దాటి విస్తరిస్తుందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వార్నింగ్ ఇచ్చింది. ఇప్పటికే గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. సౌదీ అరేబియాలో అమెరికాకు చెందిన రెండు పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, ఇజ్రాయెల్ సైనిక సామాగ్రి తరలించే నౌకపై కూడా కచ్చితమైన దాడులు చేశామని పేర్కొంది. పౌర లక్ష్యాలను తాము టార్గెట్ చేసుకోమని, కానీ తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే మాత్రం వెనకడుగు వేసే ప్రసక్తేలేదని, ప్రతీకారం తీర్చుకుంటామని పునరుద్ఘాటించింది.





### మరో బాంబ్ పేల్చిన ఇరాన్

ఓ సైకో తమని ఏం చేయాలేడని చెప్పిన ఇరాన్.. ఇప్పటికే చర్చల ప్రక్రియని నిలిపివేసింది. 'మా ఇంధన వనరులు, బ్రిడ్జిలపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. ప్రపంచ చమురు రవాణా మొత్తాన్ని అస్తవ్యస్తం చేస్తాం' అని ఇరాన్ అల్టిమేటం జారీ చేసింది. ఇకపోతే ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా నౌకలకు గేట్‌వేగా ఉండే బాబ్ అల్ మండేబ్ మార్గాన్ని మూసేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఈ రూట్‌లో నిత్యం 45లక్షల బ్యారెళ్ల చమురు రవాణా జరుగుతుంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో 12శాతం ఈ మార్గంలోనే రవాణా జరుగుతుంది. ఒకవేళ ఇది మూసుకుపోతే మరింత ఇంధన సంక్షోభం తలెత్తడం గ్యారంటీ. ఇప్పటికే హర్మ్యజ్ జలసంధి మూతపడగా.. ఇప్పుడు బాబ్ అల్ మండేబ్ మార్గాన్ని కూడా మూసేస్తే ఆఫ్రికా దేశాల చుట్టూ తిరిగి రావడానికి 14 రోజులు పడుతుంది.




**సంపాదకీయం**

# అభివృద్ధికి 'రాజకీయ' గ్రహణం

## తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న వింత పోకడలు

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. కానీ, అధికార పీఠం కోసం రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధి ప్రాజెక్టులను పణంగా పెట్టడం పాలకులకు పరిపాటిగా మారింది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం వరకు.. అన్నీ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతుండటం ఆందోళనకరం. రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు. ఈ రెండింటినీ వేర్వేరు ధ్రువాలుగా చూడనంత కాలం వ్యవస్థలో మార్పు రాదు. ఈ రెండింటిని కలగలిపి చూడటం వల్లనే అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు, రాజకీయ కక్షలు మరియు సంకుచిత ప్రయోజనాల వల్ల వెనక్కి నెట్టబడుతున్నాయి.

### మూసీ ప్రక్షాళన: పట్టుదల - ప్రతిఘటన

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా ఉండాల్సిన మూసీ నది నేడు మురుగు కూపంగా మారింది. దీనిని ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే, ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం 'నిర్వాసితుల సంక్షేమం'. ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు, స్థలం కోల్పోయిన వారికి స్థలం ఇచ్చి, వారు ఆనందపడేలా ఉత్తమ ప్యాకేజీని అమలు చేయాలి. ప్రభుత్వం చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళ్లడం మంచిదే, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గౌరవించాలి. మరోవైపు, నగర మురుగునీటిని మళ్లించే ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఇంతకాలం హైదరాబాద్ మురుగునంతా మూసీలోనే పారబోశారు, దానికి శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం సౌందర్యీకరణ చేస్తే ఫలితం ఉండదు. అయితే, ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప, 'ఇలా చేస్తే బాగుంటుంది' అని ఎందుకు సలహాలు ఇవ్వడం లేదు? పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్న పాత పాలకులు, ఇప్పుడైనా నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిని రాజకీయంతో ముడిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలే దెబ్బతింటాయి.

### అమరావతి: అయోమయ రాజకీయం

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పరిస్థితి మరీ దారుణం. ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం కార్యాలయాల సముదాయం కాదు, అది ఆ రాష్ట్ర గౌరవం మరియు ఆదాయ వనరు. 2019లో భారీ మెజారిటీతో 151 సీట్లు కట్టబెట్టిన ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన బహుమతి ఏంటి? ఐదేళ్ల పాటు 'మూడు రాజధానుల' పేరుతో కాలయాపన చేయడం, అభివృద్ధిని పడకేయించడం. అప్పుడు రాని 'మావిగన్' ఆలోచనలు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రావడం చూస్తుంటే, అది కేవలం అమరావతిపై ఉన్న ద్వేషమే తప్ప రాష్ట్రంపై ఉన్న ప్రేమ కాదని స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని చెప్పడం ద్వారా ఆయన తన రాజకీయ అజ్ఞానాన్ని లేదా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజలు చైతన్యం వచ్చి గత ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు. ఇప్పటికైనా వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోకపోవడం ఆ పార్టీ నేతల దౌర్భాగ్యం. కేవలం అధికార దాహం తప్ప అభివృద్ధిపై వారికి అవగాహన లేదని వారి మాటలే స్పష్టం చేస్తున్నాయి.


### పాలకులు మేల్కోవాలి - ఆరోపణలు వీడాలి

ప్రస్తుత పాలకులు కూడా గతాన్ని గుర్తుంచుకోవాలి. కేవలం రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణాలు మాత్రమే అభివృద్ధి అని భ్రమపడకూడదు. ఇవి తాత్కాలిక ఊరటనిచ్చే సంక్షేమ పథకాలు మాత్రమే. శాశ్వత అభివృద్ధి అంటే మౌలిక వసతుల కల్పన, పారదర్శక పాలన. ముఖ్యంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై వస్తున్న భూకబ్జా ఆరోపణల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం వీడాలి. ఈ ఆరోపణలను వెంటనే ఖండించడమో లేదా విచారణ జరిపించడమో చేయకపోతే, ప్రజల్లో అనుమానాలు బలపడతాయి. నిర్మాణాత్మక పనులు మొదలుపెట్టకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే, రేవంత్ రెడ్డి కూడా రాజకీయ మూసీలో కొట్టుకుపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారు, కానీ నగరాలు వాటంతట అవే రావాలి తప్ప ఫోర్స్ చేస్తే రావు. అభివృద్ధి అనేది ఒక సహజ ప్రక్రియ అని గుర్తించాలి.

**హైదరాబాద్ నగరం ఈ స్థాయికి చేరడానికి మూడు దశాబ్దాల నిరంతర కృషి ఉంది. అభివృద్ధి అనేది ఆగిపోయే ప్రక్రియ కాదు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ నుంచి ఆదాయం వస్తున్నా, అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక వసతులు కల్పించడం సరైన మార్గం. పాలకులకు వందేళ్ల ముందుచూపు ఉండాలి. సంకుచిత ఆలోచనలు పక్కన పెట్టి, అభివృద్ధికి బాటలు వేసినప్పుడే రాష్ట్రాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. భజనపరుల మాటలు నమ్మి వాస్తవాలను విస్మరిస్తే పతనం తప్పదని గత పాలకులు ఇప్పటికే నిరూపించారు.**

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

- 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
- ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
- ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

### ఇక నుంచి 5 కేజీల రెండు సిలిండర్ల సరఫరా

### రాష్ట్రాలకు సూచించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజీల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

### కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

### 9వ తేదీ నుంచి 29 వరకు అమలు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూ ఓడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సివుండగా, అస్సాంలో సాయంత్రం 5 గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.



# తెల్లదొరల గుండెల్లో బాంబుల మోత

1929 ఏప్రిల్ 8 తేదీన ప్రజారక్షణ, వ్యాపార వివాదల చట్టాల ఆమోదానికి నిరసనగా భగత్ సింగ్, బతుకేస్వర్ దత్ తో కలిసి కేంద్రీయ విధాన సభ లోకి బాంబులు విసిరారు. భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 ఉ 1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా నేటికీ కొనియాడ బడుతున్నాడు.

భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్న చిన్న గడ్డిపరక లను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ " తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు.

లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928 లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనం గా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు.

ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంటపడకుండా ఉండటానికి భగత్ లాహోర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెంద్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు.

భగత్ సింగ్ వంటి విప్లవకారులను అణచివేయడం కోసం భారత రక్షణ చట్టమును తీసుకు రావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. శాసనసభ వసారాపై భగత్ సింగ్‌తో పాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న సింగ్, దత్‌లు బాంబు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తు పలు కరపత్రాలను వెదజల్లారు. కేంద్ర అసెంబ్లీ ఆవరణలో కరపత్రం విసిరివేత, బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. బాంబు గాయపరిచేటంత శక్తివంతమైంది కాదని బ్రిటీష్ ఫోరెన్సిక్స్ విచారణాధికారులు కూడా తేల్చిచెప్పారు. వాస్తవానికి బాంబు జనాలకు దూర బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగిపోయారు. సింగ్ అరెస్టు అనంతరం శాసనసభ పేలుడుపై విచారణ నేపథ్యంలో జే. పీ. సాండర్స్ హత్య వెనుక ఆయన హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్, రాజ్‌గురు , సుఖ్‌దేవ్‌లపై అభియోగాలు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపించుకునేందుకు న్యాయస్థానాన్నే ఒక ప్రచార వేదికగా మలుచుకోవాలని భగత్ సింగ్ నిర్ణయించుకున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన ఆయన విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్వతంత్ర భావుకుడు శంకరంబాడి

**ఏప్రిల్ 8..శంకరంబాడి సుందరాచారి వర్ధంతి**



శంకరంబాడి సుందరాచారి (ఆగష్టు 10, 1914 – ఏప్రిల్ 8, 1977) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లికి మల్లె పూదండ రచయిత. శంకరంబాడి సుందరాచారిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము ప్రసన్న కవి అని గౌరవించింది. ఆయనను సుందరకవి, భావకవి అనీ, అహంభావకవి అనీ కూడా అనేవారు. సుందరాచారి, 1914 ఆగష్టు 10 న తిరుపతిలో జన్మించాడు. అతని మాతృభాష తమిళం. మదనపల్లెలో బిసెంట్ థియొసాఫికల్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిన్నతనం నుండే ఆయన స్వతంత్ర భావాలు కలిగి ఉండేవాడు. సనాతన సంప్రదాయాలను వ్యతిరేకించే వాడు.కన్న తండ్రి మందలిస్తే, కోపం తెచ్చుకుని, పంతానికి పోయి, ఇంటి నుండి బయటికి వెళ్ళి పోయాడు.

భుక్తి కొరకు ఎన్నో పనులు చేసాడు. తిరుపతిలో హోటలు సర్వరుగా పనిచేసాడు. రైల్వే స్టేషనులో కూలీగా కూడా పనిచేసాడు. ఆంధ్ర పత్రికలో అచ్చుదోషాలు దిద్దేవాడిగా, ఉపాధ్యాయుడిగా, పాఠశాల పర్యవేక్షకుడిగా ఎన్నో వైవిధ్య భరితమైన పనులు చేసాడాయన. అమితమైన ఆత్మవిశ్వాసం ఆయన సొంతం. ఒకసారి ఏదైనా పని వెతుక్కుందామని మద్రాసు వెళ్ళాడు. ఆంధ్ర పత్రిక ఆఫీసుకు వెళ్ళి పని కావాలని అడిగాడు. దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వర రావు పంతులు "నీకు తెలుగు వచ్చా" అని అడిగాడు. దానికి సమాధానంగా "మీకు తెలుగు రాదా" అని అడిగాడు. నివ్వెర పోయిన పంతులుతో నేనిప్పటి వరకు తెలుగు లోనే కదా మాట్లాడాను, అందుకే మీ ప్రశ్నకు సమాధానం ఎలా ఇవ్వాలో తెలియ లేదు అని అన్నాడు. ఆంధ్ర పత్రికలో ఉద్యోగం చేస్తుండగా, ఒక ప్రముఖునిపై పద్యం వ్రాయవలసి వచ్చింది. నేను వ్యక్తులపై పద్యాలు వ్రాయను అని భీష్మించుకుని, దాని కోసం ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు సుందరాచారి. తరువాత విద్యాశాఖలో పాఠశాల పర్యవేక్షకుడిగా పనిచేసాడు. నందనూరులో ఉండగా ఒకసారి పాఠశాల సంచాలకుడు వచ్చాడు. ఆ సంచాలకుడు సుందరాచారిని బంట్రోతుగాను, బంట్రోతును సుందరాచారిగాను పొరబడ్డాడు. దానికి కోపగించి, సుందరాచారి ఆ ఉద్యోగానికి తక్షణమే రాజీనామా చేసాడు.

ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య వేదమ్మాళ్ మనో వ్యాధిగ్రస్తురాలైన కారణంగా ఆయన వేదన చెంది, జీవిత చరమాంకంలో ఒక రకమైన నిర్లిప్త జీవితం గడిపాడు. తాగుడుకు అలవాటు పడ్డాడు. సుందరాచారి 1977 ఏప్రిల్ 8 న తిరుపతి, గంగుండ్ర మండపం వీధిలో నివాస ముంటున్న ఇంట్లో మరణించాడు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి పట్టణం తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి సర్కిల్‌లో సుందరాచారి జ్ఞాపకార్థం, ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన పట్ల కృతజ్ఞతాసూచకంగా విగ్రహం దగ్గర ధ్వనివర్ధకం ద్వారా నిరంతరం మా తెలుగు తల్లికీ పాట నిరంతరంగా ధ్వనించే ఏర్పాటు చేసింది.

మహాత్మా గాంధీ హత్య జరిగినపుడు ఆవేదన చెంది, బలిదానం అనే కావ్యం వ్రాసాడు. ఆ పద్యాలను పాఠశాలలో పిల్లలకు ఆయనే చదివి వినిపించాడట. సుందర రామాయణం అనే పేరుతో రామాయణం రచించాడు. అలాగే సుందర భారతం కూడా వ్రాసాడు. తిరుపతి వేంకటేశ్వర స్వామి పేరు మకుటంగా శ్రీనివాస శతకం రచించాడు. ఇవే కాక జపమాల, బుద్ధగీతి అనే పేరుతో బుద్ధ చరిత్ర కూడా రాసాడు. రవీంద్రుని గీతాంజలిని అనువదించాడు. మూలంలోని భావాన్ని మాత్రమే తీసుకుని, భావం చెడకుండా, తెలుగు నుడికారం పోకుండా చేసిన ఆ స్వతంత్ర అనువాదం బహు ప్రశంసలు పొందింది. ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం కూడా రచించాడు. సుందర సుధా బిందువులు అనే పేరుతో భావ గీతాలు వ్రాసాడు. జానపద గీతాలు వ్రాసాడు, స్థల పురాణ రచనలు చేసాడు. ఇవే కాక అపవాదు, పేదకవి, నాస్వామి, నేటి కవిత్వము, బలిదానము, కార్వేటి నగరరాజ నీరాజనము మొదలైనవి వీరి ఇతర రచనలు. మహాత్మాగాంధీ, బిల్హణీయం, దీనబంధు అనే సినిమాలకు పాటలు కూడా వ్రాసాడు. దీనబంధు సినిమాలో నటించాడు కూడా. సుందరాచారి "మా తెలుగు తల్లికి" గీతాన్ని 1942లో దీనబంధు సినిమా కోసం రచించాడు. కానీ ఆ చిత్ర నిర్మాతకు యుగళ గీతంగా వాడడానికి నచ్చక పోవటం వల్ల ఆ సినిమాలో చేర్చలేదు. టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం ఆ పాటను మధురంగా పాడిన తరువాతనే ఆ గీతానికి గుర్తింపు లభించింది.

ఒకసారి ఢిల్లీ వెళ్ళి అక్కడ నెహ్రూను కలిసాడు. తాను రచించిన బుద్ధ చరిత్ర లోని ఒక పద్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ఆయనకు వినిపించాడు. నెహ్రూ ముగ్ధుడై ఆయనను మెచ్చుకుని 500 రూపాయలు బహూకరించాడు. సుందరాచారి గురించి పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ... మృదువైన పదములు, మధురమైన శైలి, మంచి కల్పన కలిగి వీరి కవిత్వము అనందము నాపాదించకలిగి ఉంది. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ... తెలుగు పలుకు, కవితాశక్తి, సౌకుమార్యము, ఈమూడు గుణములు మూటకట్టి వీరు పొత్తములను రచించు చున్నట్లున్నది. ఈ యుగములో వీరిదొక ప్రత్యేక వాఙ్మయముగా ఏర్పాటు కాబోవు చున్నట్లున్నది. వీరిశైలి సంస్కృత సమాసముల నుండియు, మారుమూల పదముల నుండియు విడివడి సరళమైనది.

**గడియారం వేంకటశేష శాస్త్రి:** ఈతని శైలి మిక్కిలి సరళమైనది. భాష సుగమనమైనది. ధార సహజమైనది. పోకడలు, ఎత్తుగడలు, అలంకారములు చమత్కారములు, మున్నగు ప్రసాధనము లన్నియు సుమచిత సన్నివేశములే భావ శ్రుతిలో మేళవించినవి.

**శ్రీరాయప్రోలు సుబ్బారావు:** సుందరాచారి గారి సూక్తి ఎంత తేటగా సూటిగా వినబడుతుందో అంత స్ఫురితంగా సుదూరంగా ధ్వనిస్తుంది. ఇది ఈ కవి రచనలలోని అనన్య విశిష్టత.

**శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ:** తేటగీతుల తెలుగు తీదీపిరుచుల యూట....కొంకుల కొసరుల కాటుపడక సారతరమిది సుందరాచారి కవిత.

శంకరంబాడి సుందరాచారి గొప్ప కవి. పద్య కవిత్వం ఆయనకు ప్రీతిపాత్రమైన కవితా ప్రక్రియ. పద్యాలలోనూ తేటగీతి ఆయన ఎంతో ఇష్టపడ్డ ఛందస్సు. తేటగీతిలో ఎన్నో పద్యాలు వ్రాసాడు. "నా పేరు కూడా (శంకరంబాడి సుందరాచారి) తేటగీతిలో ఇమిడింది, అందుకనే నాకది బాగా ఇష్టం" అనేవాడు ఆయన. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గీతమైన తేటగీతులలోనే రాసిన మా తెలుగు తల్లికి.. ఆయన రచనలలో మణిపూస వంటిది. రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని రమ్యంగా వర్ణించిన నాలుగు పద్యాలు అవి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది.

**మా తెలుగు తల్లికి మల్లె పూదండ,**
**మా కన్న తల్లికి మంగళారతులు.**
**కడుపులో బంగారు కనుచూపులో కరుణ, చిరునవ్వు లో**
**సిరులు దొరలించు మా తల్లి.**
**గల గలా గోదారి కదలి పోతుంటేను, బిర బిరా కృష్ణమ్మ**
**పరుగులిడు తుంటేను, బంగారు పంటలే పండుతాయి,**
**మురిపాల ముత్యాలు దొరలుతాయి.**
**అమరావతీ నగర అపురూప శిల్పాలు, త్యాగయ్య గొంతులో**
**తారాడు నాదాలు, తిక్కయ్య కలములో తీయందనాలు,**
**నిత్యమై నిఖిలమై నిలచి ఉండేదాక;**
**రుద్రమ్మ భుజ శక్తి మల్లమ్మ పతి భక్తీ, తిమ్మరుసు ధీయుక్తి కృష్ణ**
**రాయని కీర్తి, మా చెవులు రింగుమని మారు మ్రోగేదాక, నీ**
**పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం;**
**జై తెలుగు తల్లీ, జై తెలుగు తల్లీ,జై తెలుగు తల్లీ.**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
9440595494

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు

బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం.

బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన



భారత స్వాతంత్ర్య సమరంలో 'వందేమాతరం' నినాదం వింటేనే తెలియని ఉత్తేజం కలుగుతుంది. ఆ అమర గీతాన్ని అందించిన మహనీయుడు బంకించంద్ర ఛటోపాధ్యాయ. ఆయన కేవలం రచయిత, కవి మాత్రమే కాదు.. భారతీయుల గుండెల్లో దేశభక్తి సెగలు పుట్టించిన విప్లవ జ్వాల. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆ సాహితీ మూర్తిని యావత్ భారతం స్మరించుకుంటోంది. బంకించంద్ర ఛటర్జీ తన రచనలతో బెంగాలీ సమాజాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ప్రభావితం చేశారు. 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఆయన సృష్టించిన సాహిత్యం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నెముకగా నిలిచింది. ఒక కవి రాసిన దేశభక్తి గీతం ఒక జాతిని మేల్కొలిపి ఉద్యమ బాట పట్టించిన సంఘటన ప్రపంచ చరిత్రలో బంకించంద్రుడి విషయంలోనే సాధ్యమైంది. అక్షరాన్ని ఆయుధంగా మార్చి బ్రిటీష్ పాలనపై సమర శంఖం పూరించిన ధీశాలి ఆయన.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్

1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.



భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.





# రహదారి కష్టాలకు చెక్

- ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి సీపీఆర్ఐ రోడ్డు వరకు పర్యవేక్షణ
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఆర్వీ ఫౌండేషన్ ఛైర్మన్ తుంగతుర్తి రవి చొరవ
- గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- త్వరలోనే పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన

**మేడ్చల్, మార్చి 7 :** మేడిపల్లి 9వ డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి పర్వతపూర్ సీపీఆర్ఐ రోడ్డులోని సాయి ఐశ్వర్య కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తు ング తుర్తి రవి స్పందించారు. మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులతో కలిసి రోడ్డును పర్యవేక్షించారు.

### సమస్యల మూలాల గుర్తింపు

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఎన్నిసార్లు రోడ్డు వేసినా డ్రైనేజీ, వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల తరచూ గుంతలు పడుతున్నాయని పేర్కొన్నారు. నీరు నిలవకుండా ఉండేందుకు రోడ్డును తగినంత ఎత్తుకు పెంచాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని కోరారు.

### త్వరితగతిన పనులు ప్రారంభించాలి

నీరు సాఫీగా వెళ్లేందుకు కొత్తగా మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో గుంతలు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులతో మాట్లాడారు. పనులను త్వరితగతిన ప్రారంభించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే కాలనీల అభివృద్ధి

- డిఫెన్స్ కాలనీ సంక్షేమ భవనం ప్రారంభం
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నవజీవన్ రెడ్డి
- సామాజిక కార్యక్రమాలకు వేదికగా నూతన భవనం
- అభివృద్ధికి అండగా ఉంటామని నేతల హామీ



**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 :** ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ లో నూతనంగా నిర్మించిన డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. డిఫెన్స్ కాలనీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ భవనం అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇది ఒక మంచి వేదిక అవుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### అందరి సహకారంతోనే ప్రగతి

కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. అందరూ కలిసికట్టుగా కాలనీ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాలనీ వాసుల చిరకాల కోరిక అయిన సంఘ భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే భాస్కర సాగర్, మల్లేష్, దీపావళి శ్రవణ్, కాలనీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు నరసింహ, జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు!

### అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి
### ఎల్బీనగర్‌లో పెన్షనర్ల భారీ నిరసన
### ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం: నర్సిరెడ్డి

**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 :** అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తక్షణమే యుద్ధ విరమణ చేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. 'యుద్ధం వద్దు.. ప్రపంచ శాంతి ముద్దు' అనే నినాదంతో పెన్షన్ సంఘాల ఆధ్వర్యంలో పనామా నుంచి రెడ్ ట్యాంకు వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమాసియా దేశాల్లో సాగుతున్న యుద్ధం వల్ల వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద ధోరణి వీడి తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ యుద్ధ ప్రభావం వల్ల మన దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని నర్సిరెడ్డి పేర్కొన్నారు. దీనివల్ల భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ దేశాలు ఏకమై యుద్ధాన్ని నివారించకపోతే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలంతా విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### వ్యాపారాలు దివాలా

యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరా నిలిచిపోయి సామాన్య ప్రజలు, హోటల్ వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నర్సిరెడ్డి తెలిపారు. ఇంధన కొరత వల్ల అనేక వ్యాపారాలు దివాలా తీస్తున్నాయని ఆవేదన చెందారు. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేస్తోందనే తప్పుడు ప్రచారంతోనే యుద్ధాన్ని ప్రేరేపిస్తూ ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ అసోసియేషన్ జిల్లా నాయకులు కృష్ణారావు, నోముల సుదర్శన్ రెడ్డి, బ్రహ్మచారి, అనసూయ, బీజీఎం రెడ్డి పాల్గొన్నారు. కీసరి నర్సిరెడ్డి, ముషం నరహరి తదితరులు ర్యాలీలో పాల్గొని నిరసన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.




# కార్పొరేట్ విద్యకు సీఎం ఊతం

### ఏవీఎన్ స్కూల్ ప్రారంభంపై టీఆర్పీ ఆగ్రహం
### ఫీజుల దోపిడీకి ప్రభుత్వమే వత్తాసు?
### ఎల్ కేజీకి ఐదు లక్షల ఫీజు వసూలా?
### విద్యాశాఖను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి
### గ్లోబల్ స్కూల్స్ పేరిట సామాన్యుల దోపిడీ
### ఎల్బీనగర్ ఇంచార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్

**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 :** ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వాలే కార్పొరేట్ సంస్థలకు ఊతమిస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ అనే కార్పొరేట్ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వెళ్లడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. విద్యను వ్యాపారం చేస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న దోపిడీకి ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. మంగళవారం ఎల్బీనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



### ఫీజుల దోపిడీపై నిలదీత

ఇంటర్నేషనల్, గ్లోబల్, ఎక్సెల్ ప్రీమియం వంటి పేర్లతో కొత్త రకం దోపిడీకి తెరలేపారని వెంకటేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవీఎన్ లేక్ ఫీల్డ్ వంటి సంస్థలు ఎల్ కేజీ సీటుకే ఐదు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా అరికట్టలేని చేతగాని ప్రభుత్వం, స్వయంగా సీఎం హోదాలో ఆ స్కూల్ ప్రారంభోత్సవానికి వెళ్లడం ప్రజలకు, విద్యార్థులకు ఏం సంకేతం ఇస్తుందని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖను తన గుప్పెట్లో పెట్టుకుని వ్యాపారమయం చేస్తోందని ఎద్దేవా చేశారు.

### రాజకీయ బంధుత్వం.. విద్యా వ్యాపారం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వియ్యంకుడు, బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి సంబంధించిన ఈ విద్యాసంస్థను సీఎం ప్రోత్సహించడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో నీతులు చెబుతూ, మరోవైపు కార్పొరేట్ విద్యను భుజాన వేసుకోవడం దారుణమన్నారు. విద్యాశాఖను రెండేళ్లుగా తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, ఒక్కసారి కూడా సమీక్ష చేయకుండా కార్పొరేట్ స్కూళ్లకు బ్రాండ్ అంబాసిడర్‌లా మారుతున్నారని దుయ్యబట్టారు.

### ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

డీపీఎస్ వంటి సంస్థల పేరుతో ఇప్పటికే లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న వ్యక్తులకే మళ్లీ గ్లోబల్ స్కూళ్ల పేరుతో దోపిడీ చేసే అవకాశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్పొరేట్ విద్యా దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా ఇలాంటి విద్యా వ్యాపారులను వెనకేసుకురావడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వెంకటేష్ గౌడ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోరాటాల సీపీఐకి చేయూతనివ్వండి

### భగత్ సింగ్ నగర్ లో 'ఇంటింటికి సీపీఐ'
### బస్తీల్లో ప్రజా సమస్యల గుర్తింపు
### దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి
### ముమ్మరంగా సాగుతున్న పార్టీ ప్రచారం
### ప్రభుత్వానికి బాతరాజు నరసింహ డిమాండ్



**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సరూర్ నగర్ మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఏప్రిల్ 1 నుంచి 10 వరకు రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా భగత్ సింగ్ నగర్ లో నేతలు పర్యటించారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బస్తీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

### బస్తీల్లో దోమల రాజ్యమా?

పర్యటనలో భాగంగా బస్తీవాసులు తమ గోడును నేతల ముందు వెళ్లగక్కారు. కాలనీలో దోమల బెడద విపరీతంగా ఉందని, డ్రైనేజీ సమస్యలతో నరకం చూస్తున్నామని వాపోయారు. ఈ సందర్భంగా బాతరాజు నరసింహ మాట్లాడుతూ.. దోమల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే బస్తీల్లో దోమల మందు కొట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ ఇబ్బందులను వెంటనే పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

### కార్యకర్తల ఉత్సాహం

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గ్యార క్రాంతి కుమార్, రామావత్ సక్రు నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు భగత్ సింగ్ నగర్ శాఖ కార్యదర్శి ఉష, ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి ఎండీ ఇస్మైల్, సీనియర్ నాయకులు వడ్రే ఇస్తారి, జిల్లా నాయకులు కరుణాచారి, ఇన్సాఫ్, సరూర్ నగర్ మండల కార్యదర్శి జాహెద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఐకి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఈ సందర్భంగా నేతలు కోరారు.

## పది పరీక్షా కేంద్రాన్నితనిఖీ చేసిన కలెక్టర్



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని బాలక్ మందిర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించిన కేంద్రంలో ఉన్న వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, తగిన పర్యవేక్షణతో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు ఉదయ్ రావు, ప్రేమ్ నివాస్, చీఫ్ సూపరింటెండెంట్ సారా ఖాతూన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాజ్వేందర్ తదితరులు ఉన్నారు.

## మస్జీద్ అనుబంధ భూమి కొనుగోలుకు సర్పంచ్ ఆర్థిక సహాయం



**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో మస్జీద్ అనుబంధ భూమి కొనుగోలు కోసం గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన ఆంజనేయులు రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం ఈ మొత్తాన్ని ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న మతసామరస్యానికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మస్జీద్ అభివృద్ధికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ముస్లిం కమిటీ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సహాయం కోరగానే వెంటనే స్పందించి ఆర్థికంగా తోడ్పాటు అందించినందుకు కమిటీ తరపున షేక్ షబ్బీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కళ్యాణ్ కుమార్, చంద్రయ్య, గ్రామస్తులు రత్నాకర్, బాలనర్సు, శ్రీనివాస్, ఏడబోయిన అనీల్, ముస్లిం కమిటీ ఉపాధ్యక్షుడు ఆసిఫ్, కోశాధికారి సమీర్, సభ్యులు హెదుల్ హుస్సేన్, అహ్మద్ హుస్సేన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ లీకేజీతో వృథాగా నీరు

### పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు



**తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 4వ వార్డులో తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా పెద్ద మొత్తంలో నీరు రోడ్డుపైకి వృథాగా పోతున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ ద్వారా సరఫరా చేసే తాగునీరు పైపులైన్ లీకేజీ కారణంగా నిరంతరం రోడ్డుపైకి పొంగిపోతుండడంతో నీటి వృథా ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు, సిబ్బందికి తెలియజేసినా నామమాత్రంగా మాత్రమే మరమ్మత్తులు చేయడంతో సమస్య మళ్లీ తలెత్తుతోందని వార్డు ప్రజలు తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి అవసరాలు అధికంగా ఉన్న సమయంలో ఈ విధంగా నీరు వృథా కావడంతో ప్రజలకు సరిపడా నీరు అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత మరమ్మత్తులు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**మంచిర్యాల:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. మంగళవారం కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, టేకులపల్లి గ్రామపంచాయతీలను సందర్శించి కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీటి ట్యాంకులను ప్రతి పది రోజులకు ఒకసారి శుభ్రపర్చాలని, పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణం నిబంధనల ప్రకారం జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని తెలిపారు. అలాగే పెన్షన్లకు సంబంధించి అర్హులు సదరం సర్టిఫికేట్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి రమ్య, హౌసింగ్ ఏఈ గౌతమి, పంచాయతీ కార్యదర్శులు పారిపెల్లి శ్వేత, రమణ, ఉప సర్పంచులు కోట ఇంద్రమోహన్, పోలగాని దేవక్క, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా పనిచేసి ఆదిలాబాద్‌ను ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం అత్యవసరమని, ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. శిశు మరణాల రేటు తగ్గించేందుకు చేపట్టిన 'సంకల్ప' కార్యక్రమం, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో జరుగుతున్న శస్త్ర చికిత్సలు, టిబి నివారణలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. గర్భిణీల్లో రక్తహీనత సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పౌష్టికాహారం, ఐరన్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనవసరంగా ఆర్ఎంపీల వద్ద యాంటీబయోటిక్స్, ఇంజక్షన్లు తీసుకోవడం ద్వారా కిడ్నీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వేసవి కాలంలో తగినంత నీరు తాగడం, సరైన నిద్ర, యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్య స్పృహ పెరిగితే వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, నడక వంటి అలవాట్లు అవసరమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రోత్సాహంతో యోగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం సమయానికి ఆహారం, నిద్ర తప్పనిసరి అని అన్నారు. ఈ సందర్భంగా టిబి నియంత్రణపై ప్రతిజ్ఞ చేయడంతో పాటు ఆయుష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంస పత్రాలు అందజేసి, నూతన టిబి ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించారు. టిబి రోగులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయాలి

- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**సత్తుపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సాకలి ఐలమ్మ భవనంలో మంగళవారం పాలకుర్తి వీరయ్య అధ్యక్షతన సిపిఐ సత్తుపల్లి టౌన్, మండల కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇంటింటికి సిపిఐ" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి చేరుకొని ప్రజా సమస్యలపై అవగాహన కల్పించి, వారిని ఉద్యమాల వైపు దారితీయాలని సూచించారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో సామాన్య ప్రజల జీవితం కష్టసాధ్యంగా మారిందని విమర్శించారు. యుద్ధ పరిస్థితుల పేరుతో ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్నారని ఆరోపించారు.జాతీయ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నారని, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి పరిష్కారంలో విఫలమవుతున్నాయని అన్నారు. దేశంలో ధనిక, పేద అంతరం పెరుగుతోందని, రైతులు, కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలపై మరింత దృష్టి పెట్టి, ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఉన్న చోటా కమ్యూనిస్టులు ముందుంటారని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, సభ్యులు దండు జగన్, రామారావు, కోలేటి వెంకటేశ్వరరావు, నాగరాజు, షేక్ ఖాసింబి, షేక్ జాన్బి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నకు మద్దతు ధర ఇవ్వాలి

- ఏఐకేఎఫ్ నాయకుడు ఎన్ రెడ్డి హంసా రెడ్డి



**హన్మకొండ:** మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర కల్పించి, ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించక రైతులు అప్పుల పాలై, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పంట నష్టపోవడంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసిన రైతులు, ప్రస్తుతం మార్కెట్ సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర ఉండాల్సిన చోట వ్యాపారులు, మధ్య దళారులు రూ.1800 లోపే కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై ప్రకటించినా, క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదని విమర్శించారు. దీంతో వ్యాపారులు, దళారులు లాభపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రతి గ్రామంలో మార్క్ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా మద్దతు ధరకు పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేసే వ్యాపారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అనవసర కారణాలతో రైతుల పంటను తిరస్కరించే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని, మొక్కజొన్నను భేషరతుగా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఓక్కల కిషన్, కర్ర రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మల్లారెడ్డి, చీపురు ఓదయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కాల్వలో ప్రాణాపాయంలో గోమాత

- ప్రాణాలకు తెగించి కాపాడిన రానా



**సత్తుపల్లి:** మానవత్వం ఇంకా సజీవంగా ఉందనే విషయాన్ని నిరూపించే ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం రఘునాథ బంజర గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు పడిపోయి ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతున్న గోమాతను సర్పంచ్ భర్త రానా ప్రాణాలకు తెగించి కాపాడడం స్థానికులను ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. కాల్వలో చిక్కుకుని బయటపడలేక అలమటిస్తున్న గోమాతను గమనించిన రఘునాథ గూడెం గ్రామ సర్పంచ్ కుక్కా సుధారాణి భర్త రానా క్షణం ఆలస్యం చేయకుండా స్పందించాడు. పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన ఆయన వెంటనే కాల్వలోకి దూకి గోమాతను రక్షించేందుకు ప్రయత్నించాడు. అయితే భయంతో ఉన్న గోవు దగ్గరకు రానీయకపోవడంతో సుమారు రెండు కిలో మీటర్ల మేర కాల్వలో ఈదుకుంటూ వెంబడించాల్సి వచ్చింది. ఇరువైపులా గోడలు ఉండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారినా, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రానా ధైర్యంగా పోరాడాడు. చివరికి కొంత వెసులుబాటు ఉన్న ప్రదేశానికి చేరుకున్న తర్వాత స్థానికుల సహకారంతో తాళ్ల సహాయంతో గోమాతను సురక్షితంగా ఒడ్డుకు లాగారు. ప్రాణాపాయంలో ఉన్న మూగజీవాన్ని కాపాడిన రానా ధైర్యసాహసం గ్రామంలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది. గ్రామ అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా కరుణా హృదయంతో గోమాత ప్రాణాలను రక్షించిన ఆయనను స్థానికులు అభినందించారు. ఈ రక్షణ కార్యక్రమంలో కుక్కా లాలు, పోతురాజు రాము, అంజారావు, రావుల సీతయ్య, బండి వెంకయ్య, నల్లగొర్ల నాగేశ్వరరావు, కుక్క శ్రీనివాసరావు, కొలికపోగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**నేరడిగొండ:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి ఆ వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆయన సంఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడి వివరాలు ఇంకా తెలియ రాలేదు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా స్థానిక ఎస్సై సెల్:8712659947, ఇచ్చోడ సీఐ సెల్: 8712659936 లకు సమాచారం అందించాలని కోరారు.

# హత్య కేసు నిందితుడు మళ్లీ అరెస్ట్

**• రెండు ప్రత్యేక బృందాలతో పట్టుకున్న పోలీసులు**



**ఆసిఫాబాద్:** తిర్యాణి మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హన్మంత రావును హత్య చేసిన కేసులో పరారీలో ఉన్న నిందితుడు రాయిసిడం వినోద్ కుమార్‌ను మంగళవారం ఉదయం గోలేటి ఎక్స్‌రోడ్ ఆటో స్టాండ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. రెబ్బెన సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. హన్మంతరావ్ మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో వినోద్, అతని కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని భావించిన నేపథ్యంలో గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి ఇరువర్గాలు శాంతిగా ఉండాలని సూచించినప్పటికీ వివాదం కొనసాగిందన్నారు. ఈ క్రమంలో 2025 నవంబర్ 1న పొలంలో పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న హన్మంతరావుపై వినోద్ తన ఇంటి ముందు గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో హన్మంతరావ్ మెడపై తీవ్ర గాయాలు కాగా, చెవి కూడా తెగిపోయినట్లు గుర్తించామని చెప్పారు. సంఘటన సమయంలో అక్కడే ఉన్న హన్మంతరావ్ భార్య బొజ్జు బాయిని కూడా హత్య చేస్తానని నిందితుడు బెదిరించడంతో ఆమె భయంతో అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వినోద్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో మూత్ర విసర్జనకు వెళ్తానని చెప్పి విధుల్లో ఉన్న సిబ్బందిని తోసివేసి పరారైనట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో మరో కేసు కూడా నమోదు చేసినట్లు అన్నారు. నిందితుడు పరారీలో ఉండటంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కఠిన నిఘా నేపథ్యంలో మంగళవారం నిందితుడు వినోద్‌ను మళ్లీ అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. అనంతరం విచారణ జరిపి చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. హత్య కేసులో పరారైన నిందితుడిని పట్టుకోవడంలో తిర్యాణి ఎస్సై వెంకటేష్ బృందం చాకచక్యంగా వ్యవహరించిందని ఏఎస్పీ చిత్తరంజన్ ప్రశంసించారు. నిందితుడు జన్నారంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి తిర్యాణి వస్తుండగా మాటువేసి పట్టుకున్న సీఐ సంజయ్ కుమార్, ఎస్సై వెంకటేష్‌లను అభినందించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులకు రివార్డులు కూడా అందజేశారు.

# ద్వారకాపూర్‌లో జల్ మహోత్సవం

**• ఇంటింటికీ భరోసా ఇస్తున్న మిషన్ భగీరథ**



**తాండూర్:** పల్లెల్లో ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన తాగునీటి సరఫరా కొనసాగుతోందని బెల్లంపల్లి సబ్ డివిజన్ డీఈఈ (ఇంట్రా) మల్లయ్య తెలిపారు. మంగళవారం తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామంలో జల్ జీవన్ మిషన్ (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో జల్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికీ పైపులైన్ల ద్వారా అత్యంత శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తోందన్నారు. ప్రజలు బయట ఉన్న కలుషిత నీటి వనరులను వినియోగించి అనారోగ్యాలకు గురికాకుండా కేవలం మిషన్ భగీరథ నీటినే తాగడానికి ఉపయోగించాలని సూచించారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. ల్యాబ్ మైక్రోబయాలజిస్ట్ సిరంగి సంతోష్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. అత్యాధునిక ప్రయోగశాలల్లో నీటిని నిరంతరం పరీక్షిస్తున్నామని, మైక్రోబయలాజికల్ ప్రమాణాల ప్రకారం ఈ నీరు పూర్తిగా సురక్షితమని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా ఈ నీటిని వినియోగించవచ్చని భరోసా ఇచ్చారు. ఏఈఈ మనోహర్ గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసడి తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావులతో కలిసి వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్ణీత మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. గ్రేడ్–ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి గోనె సంచులు భద్రపర్చడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, మూత్రశాలలు, విద్యుత్, టేబుల్, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రతి కేంద్రంలో రెండు ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, 30 టార్పాలిన్లు, ఒక ప్యాడి క్లీనర్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉంటే ముందుగా ఆరబెట్టి తేమ తగ్గిన తర్వాతనే తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చినప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ ప్రతులు సమర్పించాలని, వ్యవసాయ విస్తరణ అధికారి జారీ చేసిన టోకెన్ ఆధారంగా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు ధృవీకరణ పత్రం సమర్పించాలన్నారు. సన్న రకం ధాన్యం సంచులపై ఎరుపు రంగుతో ‘ఎస్’ అక్షరం, సెంటర్ కోడ్ రాయాలని, దొడ్డు రకం ధాన్యం సంచులను ఆకుపచ్చ రంగు దారంతో కుట్టాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరు లారీల్లో తరలించాలని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుకు తూకం వివరాలతో కొనుగోలు పత్రం ఇవ్వాలని, జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, జిల్లా రవాణా అధికారి సంతోష్, కార్మిక శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అనంతరం పోచంపహాడ్ గ్రామ పరిధిలో మండల తహశీల్దార్ పుష్పలతతో కలిసి జాతీయ రహదారి–63 విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి గడువులోగా జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో వంద శాతం ప్రవేశాలు కల్పించాలి

**• రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్**

**ఆదిలాబాద్:** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ వసతి గృహాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను వంద శాతం ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ సి.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన ఆయన పలు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ఇచ్చోడ, బజార్‌హత్నూర్ ప్రాంతాల్లోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు ఆదిలాబాద్‌లోని కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. భోజన సదుపాయాలు, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రతినెలా విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని, వివిధ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సమీక్ష, ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఏఎస్‌డబ్ల్యుఓలు నారాయణ రెడ్డి, నర్సింగ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంపై జోగు రామన్న వ్యాఖ్యలు అర్థరహితం



**ఆదిలాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జోగు రామన్న చేసిన విమర్శలు కేవలం రాజకీయ ఉనికి కోసమేనని, అవి పూర్తిగా అర్థరహితమని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ సాయిచరణ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన జోగు రామన్నకు ఇప్పుడు మహిళా గౌరవం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో బతుకమ్మ చీరల పేరుతో నాసిరకం వస్త్రాలను పంపిణీ చేసి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాణ్యమైన ‘చిలుక పచ్చ’ రంగు చీరలను పంపిణీ చేస్తామని ప్రకటించగానే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల గూటికి సంక్షేమాన్ని చేర్చిందని తెలిపారు. జోగు రామన్న మంత్రిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ జిల్లాకు చేసిన ఒక్క అభివృద్ధి పనైనా చెప్పగలరా అని సవాల్ విసిరారు. కొరట–చనాక వంటి సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆన్‌లైన్ ఇసుక విధానంపై ట్రాక్టర్ యూనియన్ ఆందోళన

**ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి**



**ఆసిఫాబాద్:** ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్‌లైన్ ఇసుక తవ్వకం, రవాణా విధానంపై ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇంతకుముందు రూ.1400 డీడీ తీసుకుని ఇసుక రవాణా నిర్వహించుకునే విధానం అమల్లో ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే ఇసుక తవ్వకం, రవాణా చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు కారణంగా ఆన్‌లైన్ విధానం సరిగా పనిచేయడం లేదని చెప్పారు. దీంతో ఇసుక రవాణా సక్రమంగా సాగక తమ ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పాత డీడీ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కొత్త విధానం ద్వారా ఎదురవుతున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఇసుక రవాణాను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పందిస్తూ ట్రాక్టర్ యూనియన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజల దాహార్తి తీర్చిన సర్పంచ్



**తిర్యాణి:** మండలంలోని ఏదులపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించినప్పటికీ, నీరు వినియోగించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు మాత్రం ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు తెలిపారు. బోర్ మాత్రమే ఉండి మోటార్ తదితర ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలను గమనించిన గ్రామ సర్పంచ్ మడావి అమృత అంబారావు బోర్‌కు మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచంచారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సిఏ పోస్టును వెంటనే భర్తీ చేయాలి



**గంభీరావుపేట:** నర్మాల గ్రామానికి సంబంధించిన కమ్యూనిటీ అసోసియేట్ (సిఏ) పోస్టును వెంటనే భర్తీ చేయాలని బీజేపీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నర్మాల గ్రామానికి చెందిన మహిళా గ్రూప్ సిఏ ప్రత్యేక పరిస్థితుల్లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ఆ పోస్టును భర్తీ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇటీవల నియామక ప్రక్రియకు తేదీలు ప్రకటించి అనంతరం రద్దు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పరీక్ష నిర్వహించినప్పటికీ నియామక ప్రక్రియను చేపట్టకపోవడం వెనుక ఏవైనా ఒత్తిడులు ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లోనై అధికారులు నియామకాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన అభ్యర్థులను వెంటనే ఎంపిక చేసి సిఏ పోస్టును భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఎంఎస్ ఏపీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు నర్సింలు, స్వామి, దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## తులం బంగారం ఎప్పుడు ఇస్తారు



**జైనూర్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తులం బంగారం కూడా అందిస్తామని హామీ ఇచిచందని, ఆ హామీని ఇప్పటికైనా నెరవేర్చాలని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను త్వరగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**జైనూర్:** మండలంలోని జండాగూడ గ్రామానికి చెందిన కోరంగా రాదాబాయికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా రూ.28వేల ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం మీరా జాలీంషా, మెస్రం స్పందన భూపతి, పంద్రా కౌసల్య షేకు, సేద్మకి జానేరావు, మడావి లక్ష్మణ్, కోట్నాక్ బాపూజీ, దుర్వ సింధు నగేష్, కాంగ్రెస్ నాయకులు మెస్రం అంబాజీ రావు, పెందుర్ ప్రకాష్, గెడం గోపీచంద్ పాల్గొన్నారు.

## శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని మార్కెటింగ్ కమిటీ గోదాంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన శనగలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు తగిన మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనగ కొనుగోలు కేంద్రం ద్వారా క్వింటాలుకు రూ.5,875 మద్దతు ధరతో కొనుగోలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు, ఆసిఫాబాద్ గ్రంథాలయ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, జైనూర్ ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, జైనూర్ సహకార మాజీ చైర్మన్ కొడప హన్ను పటేల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, డీసీఓ మోహన్, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ ఆడ బీర్షావ్, ఆర్ఐ మోహన్, సహకార బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్, సహకార సీఈఓ సోన్ కాంబ్లే జనార్ధన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ మాజీ జవాన్ మృతి



**నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సమీపంలో జాతీయ రహదారి–44పై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ మాజీ జవాన్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండల కేంద్రానికి చెందిన బీఎస్ఎఫ్ మాజీ జవాన్ జక్కులవార్ మురళి సోమవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం అతన్ని బలంగా ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం ద్వారా ఘటన గురించి తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# ప్రతిఒక్కరికి మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల:** ప్రతిఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్ఎంఓలు భీష్మ, శ్రీధర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుధాకర్ నాయక్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుజాతలతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాల ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 25 ఆరోగ్య కేంద్రాలు, 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, బెల్లంపల్లి, లక్షెట్టిపేట ప్రాంతాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. భీమారం, కన్నెపల్లి మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయగా, చెన్నూర్ పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్‌రే, ఫోటోథెరపీ వంటి సేవలు అందిస్తున్నామని, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా 72 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా కేసుల గుర్తింపు, మొబైల్ ఎక్స్‌రే ద్వారా మారుమూల గ్రామాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణీల నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించడం జరుగుతోందని చెప్పారు. డయాబెటిస్, బీపీ, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించడమే కాకుండా హోమియోపతి, ఆయుర్వేదం వంటి ఆయుష్ ఆరోగ్య కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, నర్సింగ్ అధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వైద్యాధికారులు డాక్టర్ అమర్, డాక్టర్ రమ్య, వైద్య సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మందమర్రి మండల కేంద్రంలోని కేజీబీవీను సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. భోజన తయారీ సమయంలో సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీతనంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. హాజరు పట్టికను పరిశీలించి విధులకు హాజరు కాని ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం కృషి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తుంది
- డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టేలా బీజేపీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సోమవారం బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి బాట సభ ఘనవిజయం సాధించడంపై జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సభలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు సభ విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పిప్పిరి సభ వేదికగా ముఖ్యమంత్రి ఆదిలాబాద్ అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం త్వరలో చేపడతామని, ఇది విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని అన్నారు. బోథ్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా నిలిచే కుప్టి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ రైతులకు పెద్ద అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. జూన్ 2 లోపు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదేవిధంగా ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమల అభివృద్ధి సాధిస్తామని, పర్యాటక రంగంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో నిలిపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, గిమ్మ దీపక్, జిల్లా అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, మల్యాల కరుణాకర్, గౌలి సంజీవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్మనీలో ఉద్యోగావకాశాలపై మంత్రి వివేక్ ఉన్నతస్థాయి సమావేశం

**మంచిర్యాల:** తెలంగాణ కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి మంగళవారం జర్మనీలోని హానోవర్ నగరంలో జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా ఈ సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తెలంగాణ నుంచి జర్మనీకి నైపుణ్యంతో కూడిన మానవ వనరుల పంపిణీ అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా నైపుణ్య కార్మికుల కొరత ఉన్న రంగాల్లో తెలంగాణ యువతకు అవకాశాలను గుర్తించే అంశంపై దృష్టి సారించారు. తెలంగాణ యువతకు అవసరమైన నైపుణ్య ప్రమాణాలు, భాషా శిక్షణ, సర్టిఫికేషన్ ప్రక్రియలపై కూడా సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం యువతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి వివేక్ వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్కామ్) వంటి సంస్థల ద్వారా యువతకు నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తూ గ్లోబల్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానా కిషోర్, టామ్‌కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, మేనేజర్ అనిల్ కుమార్, డీఓసీ పీఎంయూ హెడ్ శ్రీనివాస్ రావు, స్కిల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ బాలా రమణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల దృష్ట్యా పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఇతర కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిందిగా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్యం, అలంకరణ, మరమ్మత్తులు, త్రాగునీటి ఏర్పాటు, అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ దీపాలంకరణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యవసర సేవల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు అన్ని శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వివరించారు.

# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష
- వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు

**గోదావరిఖని, ఏప్రిల్ 07:** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. దొంగతనాల నివారణ మరియు కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు. రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల




పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్-అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# 18న రాష్ట్ర స్థాయి ఉద్యమ కారులు సమావేశానికి తరలిరండి..




**మంథని, ఏప్రిల్ 07:** హైదరాబాద్ వేదికగా ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి మంథని నియోజకవర్గ నాయకులు, ఉద్యమకారులు భారీగా తరలిరావాలని మంథని నియోజకవర్గ ముఖ్య ప్రతినిధులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ భారీ బహిరంగ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విజయశాంతితో పాటు రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయ్ కుమార్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, ఉద్యమకాల్లో సభ్యుడు సర్వర్ లు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఉద్యమకారుడు, కార్యకర్త బాధ్యతగా ఈ సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, మంథని గడ్డ నుంచి మన గళాన్ని చాటాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రామగుండం మండల తహసీల్దార్ (MRO) పోస్టును తక్షణమే భర్తీ చేయాలని రెవెన్యూ శాఖ మంత్రికి లేఖ..

## కనకం గణేష్ మహారాజ్, ధర్మ సమాజ్ పార్టీ..



**పెద్దపల్లి, ఏప్రిల్ 07:** రామగుండం మండలంలో గత కొంతకాలంగా తహసీల్దార్ (MRO) పోస్టు ఖాళీగా ఉండటం వల్ల సామాన్య ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సామాజిక కార్యకర్త, BC SC ST JAC జిల్లా నాయకులు మరియు DSP (ధర్మ సమాజ్ పార్టీ) మాజీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్ మహారాజ్ అన్నారు . ఈ మేరకు ఆయన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రికి పోస్ట్ ద్వారా వినతి పత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామగుండం మండలంలో శాశ్వత తహసీల్దార్ లేకపోవడం వల్ల సుమారు 15 రోజులుగా కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ముఖ్యంగా గురుకుల, కేంద్ర విద్యాలయం, పాలిటెక్నిక్ , విద్యార్థులు తమ ఉన్నత చదువుల కోసం అవసరమైన కుల (Caste), నివాస (Residence), ఆదాయ (Income) ధ్రువీకరణ పత్రాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వేలాది దరఖాస్తులు రామగుండం MRO ఆఫీసు లో పెండింగ్‌లో ఉన్నాయని, సమయానికి సర్టిఫికెట్లు అందకపోతే విద్యార్థులు విద్యావకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేవలం విద్యార్థులే కాకుండా, ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, అత్యవసర పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రామగుండం మండల తహసీల్దార్ పోస్టును ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలి. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రజల పక్షాన ఆందోళనలు చేపడతామని... కనకం గణేష్ మహారాజ్ స్పష్టం చేశారు.

# ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పెద్దపల్లి, ఏప్రిల్ 07:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని 15 వార్డులో బీజేపీ జెండా ఎగురవేసిన బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ . ...ఏప్రిల్ 06 1980 లో భారతీయ జనతా పార్టీని స్థాపించిన మహనీయులు నేటికి 47 వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పేంజర్ల రాకేష్ మాట్లాడుతూ. బీజేపీ కార్యకర్తల పార్టీ ప్రపంచంలో నే 14 కోట్లకు పై బడి కార్యకర్తలు ఉన్నపార్టీ బీజేపీ ఇది కుటుంబ పార్టీకాదు.. చిన్న స్థాయి కార్యకర్తనయినా ఉన్నత స్థాయికి చేర్చే పార్టీ బీజేపీ దేశంలో వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన ఒక చాయ్ వాలా ఈ రోజు దేశ ప్రధానమంత్రి గా ప్రపంచాన్ని శాశించే స్థాయిలో ఉన్న మన ప్రియతమ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారు..మారుమూల గ్రామ ఆదివాసీ అయిన ద్రౌపది ముర్మ్ గారిని దేశ ప్రథమ పౌరురాలు ను చేసింది బీజేపీ గతంలో ఒక మైనారిటీ వ్యక్తి అయిన అబ్దుల్ కలామ్ గారిని మరియు దళిత ముద్దుబిడ్డ రాంనాద్ కొవింద్ గారలను రాష్ట్రపతులను చేసింది బీజేపీ పార్టీ ..మిగితా పార్టీల మాదిరి కుటుంబ పార్టీ కాదు..దేశంలోని కొన్ని పార్టీలు కాంగ్రెస్ కు నెహ్రూ తర్వాత ఇందిరా తర్వాత రాజీవ్ గాంధీ తర్వాత సోనియాగాంధీ ఆ తర్వాత రాహుల్ ఇలా కుటుంబాల రాజ్యం ఏలేటివి తెలంగాణ కేసీఆర్ కేటీఆర్ కవిత హరీష్ రావు సంతోష్ రావు ఇలా కుటుంబాలకు చెందిన పార్టీలే ఒక్క బీజేపీ మాత్రమే కార్యకర్తల నిర్ణయాలపై సిద్ధాంతం పై నడిచే ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పోలసాని సంపత్ రావు, ఈర్ల శంకర్, రాజాం మహంత, కృష్ణ, కావేటి రాజగోపాల్, వెల్లంపల్లి శ్రీనివాస్, జపతి రాజేష్, ప్రధాన కార్యదర్శిలు గుడ్ల సతీష్, సురేందర్, కోశాధికారి సతీష్, కార్యదర్శి పోగుల రాజు, మధుకర్, జాపతి శ్రీనివాస్, దాసరి రాజు, ఎర్రం రాజు, రాజశేఖర్, శ్రీనివాస్, మణిదీప్, పవన్, మహేష్, సంజీవ్, ఆదర్శ్, రాజు, సాయి, మనోజ్, ఆకాష్, వంశీ, సాగర్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.



# హిందూ సమ్మేళన గోడ ప్రతి ఆవిష్కరణ..

**తిమ్మాపూర్, ఏప్రిల్ 07:** తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉప మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 11న జరగబోయే హిందూ సమ్మేళన గోడ ప్రతిని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు , శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాధ్యులు హిందూ సమ్మేళన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. 11న శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో తలపెట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశానికి ఆత్మ హిందూ ధర్మం మని , హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడానికే హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. , హిందువులు ఎదుర్కొంటున్న అనేకసవాళ్లనుపరిష్కరించుకోవడానికి ఐక్యమత్యంతో ముందు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసాన్ని, ఐకమత్యాన్ని నింపడం, దేవాలయ వ్యవస్థ పటిష్టం చేయడం, సమాజంలో సామాజిక సమరతను నిర్మాణం చేయడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొదించడం కోసం హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగేలా చేయడమే హిందూ సమ్మేళన ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు బోనాల మోహన్ ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ , చింతం శ్రీనివాస్ , తిరుపతి రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్ , ఓదెలు లతో పాటు ముఖ్య అతిథులుగా, నల్లగొండ గ్రామ సర్పంచ్ జినుక మారత్, పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్నమహేందర్ రెడ్డి, మట్టపల్లి గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్ , మల్లాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి మమత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి అండర్ బ్రిడ్జ్ సమస్యలు.. రైల్వే అధికారులకు గ్రామ పంచాయతీ వినతి..



**పెద్దపల్లి, ఏప్రిల్ 07:** పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి రామగుండం రైల్వే A.D.E.N అధికారికి కీలక వినతిపత్రం పంపించారు.

కొత్తపల్లి వద్ద ఉన్న అండర్ బ్రిడ్జ్ (L.C.No.36) వద్ద అనేక సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని గ్రామ పంచాయతీ తెలిపింది. గ్రామ ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ అండర్ బ్రిడ్జ్ వద్ద సరైన సూచిక బోర్డులు లేకపోవడం, త్రాగునీటి పైపులైన్లు దెబ్బతినడం, విద్యుత్ లైన్లు సరిగ్గా లేకపోవడం వల్ల సమస్యలు తీవ్రంగా మారాయని పేర్కొన్నారు. అదేవిధంగా, బ్రిడ్జ్ క్రింద నీరు నిల్వ ఉండటం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అక్కడ రేడియం లైట్లు, ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కోరారు. బ్రిడ్జ్ పై భాగంలో ఇరువైపుల ఇళ్లకు వెళ్లేందుకు సరైన అప్రోచ్ రోడ్లు లేకపోవడం, అలాగే గ్రామంలోకి వెళ్లే దారిని విస్తరించి చౌరస్తాగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా గ్రామ పంచాయతీ బోర్ వేల్ దెబ్బతినడంతో కొత్త బోర్వేల్ ఏర్పాటు చేయించాలని కోరారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు రైల్వే అధికారులను కోరారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైక్లింగ్ ర్యాలీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి

**కరీంనగర్, ఏప్రిల్ 07:** సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నిస్తారని మరియు అహర్నిశలు కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & వివిన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా.వి. నరేందర్ రెడ్డి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలాం, ఐపీఎస్ తో కలిసి ఏర్పాటు చేసినటువంటి హెల్తీ సైకిల్ ర్యాలీ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని మరియు ఆహారపు అలవాట్లు సైతం మార్చుకోవడం జరుగుతుందని వారు చెప్పారు. వ్యక్తిగతంగా లాభాలు చేకూరడమే కాకుండా సమాజపరంగా చాలా లాభాలు చేకూరుతాయని వారు తెలియపర్చారు. ప్రధానంగా పర్యావరణాన్ని కాలుష్యం నుండి సంరక్షించవచ్చని మరియు చక్కటి వాతావరణన్ని ఏర్పాటు చేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఇస్తారని కావున ప్రతి ఒక్కరు సైక్లింగ్ అలవాటుగా చేసుకుని సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారు పిలుపునిచ్చారు. సైక్లింగ్ చేయడం వలన చాలా ఆరోగ్యంగా ఉండగలుగుతారని మరియు రోజువారీ కార్యకలాపాలను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వర్తించడమే కాకుండా అందులో విజయం సాధించగలుగుతారని అభిప్రాయపడ్డారు. అగ్రదేశాలైన



రష్యా, చైనా, జర్మనీ, కెనడా, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో సైక్లింగ్ కు చాలా ప్రాధాన్యత ఉన్నదని కావున సైక్లింగ్ ఉన్నటువంటి లాభాలను తెలుసుకొని దానిని రోజువారి కార్యక్రమంలో మల్చుకొని సైక్లింగ్ పట్ల శ్రద్ధ వహించాలని వారు చెప్పారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తన సారథ్యంలో కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మరియు నిర్వహణలో భాగంగా నేడు ర్యాలిని నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు స్ఫూర్తిదాయకమని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, మహేందర్, ట్రాఫిక్ సిఐ బి.సంజీవ్, ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు మరియు తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ బాధ్యులు ఎం.అరవింద్, రమేష్, జిల్లా పోలీస్ కమిషనరేట్ సిబ్బంది, రేని గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిబ్బంది, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల వారి సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలియపరిచారు. ఈ ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి బస్టాండ్ మీదుగా, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా మరియు రెనీ హాస్పిటల్ వారికి కొనసాగింది సుమారు150 మంది సైకిలిస్టులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికీ త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని వారు చెప్పారు.




# అర్ష్‌దీప్ సింగ్ 'ప్రేమ' జపం..

## మైదానంలో మెరిసిన సమ్రీన్ కౌర్!

## ఐపీఎల్ వేళ నెట్టింట వైరల్ అవుతున్న ఫోటోలు

**ముంబై:** మైదానంలో తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్ల వికెట్లను కూల్చే ఆ 'యార్కర్ కింగ్'.. ఇప్పుడు తనే ఒక అందగత్తె విసిరిన ప్రేమ వలలో చిక్కుకున్నాడా? టీమ్ ఇండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ గురి ఇప్పుడు వికెట్ల మీద కంటే.. ఒక పంజాబీ ముద్దుగుమ్మ మీదనే ఎక్కువగా ఉందా? ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న గుసగుసలు వింటే ఇది నిజమేననిపిస్తోంది. ఐపీఎల్ హడావిడిలో ఉన్న ఈ స్టార్ క్రికెటర్, ఒక పంజాబీ నటితో పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నాడనే వార్త ఇప్పుడు క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

### ఎవరీ సమ్రీన్ కౌర్?:


అర్ష్‌దీప్ మనసు గెలుచుకున్న ఆ అందగత్తె పేరు సమ్రీన్ కౌర్. పంజాబీ చిత్ర పరిశ్రమలో వర్ధమాన నటిగా రాణిస్తున్న సమ్రీన్.. తన నటనతోనే కాకుండా సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోటోలతోనూ భారీగా ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. సంగీత వీడియోల్లో మెరుస్తూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తున్న ఈ భామ, ఇప్పుడు అర్ష్‌దీప్ సింగ్ 'లేడీ లక్' గా మారిందని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు.

### ప్రేమాయాణం బయటపడిందిలా..:

వీరిద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తోందని అనుమానాలు రావడానికి ప్రధాన కారణం.. అర్ష్‌దీప్ ఇటీవల సోషల్ మీడియాలో పంచుకున్న ఒక ఫోటో. సమ్రీన్ చేతిలో చేయి వేసి ఉన్న ఫోటోను ఆయన పోస్ట్ చేయడంతో అభిమానుల కళ్లు బైర్లు కమ్మాయి. దానికి తోడు, పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు సమ్రీన్ గ్యాలరీలో ప్రత్యక్షం కావడం, పంజాబ్ జెర్సీ ధరించి అర్ష్‌దీప్‌ను ఉత్సాహపరచడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది.

### మౌనమే సమాధానమా?

అటు అర్ష్‌దీప్ కానీ, ఇటు సమ్రీన్ కానీ తమ రిలేషన్‌షిప్ గురించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. వీరిద్దరూ కేవలం డేటింగ్‌లో ఉన్నారా లేక సీరియస్ ప్రేమలో ఉన్నారా అనేది ప్రస్తుతానికి సస్పెన్సే! ఏదేమైనా, సినిమా తారలు – క్రికెటర్ల మధ్య ప్రేమాయాణాలు కొత్తేమీ కాకపోయినా.. ఈ పంజాబీ జోడీ కెమిస్ట్రీ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరి ఈ 'యార్కర్ కింగ్' తన ప్రేమ విషయాన్ని ఎప్పుడు క్లీన్ బౌల్డ్ చేస్తాడో వేచి చూడాల్సిందే!







# విజృంభించిన రాజస్థాన్!

## ముంబైపై విజయం

## 11 ఓవర్లలో పరుగుల వరద

**చెలరేగి ఆడిన యశస్వి జైస్వాల్ ● లక్ష్య ఛేదనలో చతికిలబడ్డ ముంబై ● సత్తా చాటిన బౌలర్లు**

**గువహాటీ:** ఐపీఎల్ తాజా సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తన జోరును ఏమాత్రం తగ్గించకుండా కొనసాగిస్తోంది. గువహాటీలోని బర్సపరా స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్ ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వర్షం కారణంగా ఇరు జట్లకు 11 ఓవర్ల చొప్పున కుదించిన ఈ మ్యాచ్‌లో అభిమానులకు అసలు సిసలైన పరుగుల పండగ దొరికింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌కు తోడు బౌలర్లు సైతం కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ లీగ్ దశలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో బంతితో సమిష్టిగా సత్తా చాటిన రాజస్థాన్ సొంత మైదానంలో దుమ్మురేపింది.

### వీరబాదుడు బాదారు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం వల్ల ఓవర్లు తగ్గడంతో రాజస్థాన్ బ్యాటర్లు మొదటి బంతి నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు క్రీజులో అడుగుపెట్టినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడు కేవలం 32 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతనికి జతగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేసి ఎడాపెడా షాట్లతో అలరించాడు. చివర్లో రియాన్ పరాగ్ సైతం 10 బంతుల్లో 20 పరుగులు చేయడంతో రాజస్థాన్ నిర్ణీత 11 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 150 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ముంబై బౌలర్లలో అల్లా ఘజన్ఫర్ 2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. శార్దూల్ ఠాకూర్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు.



### లక్ష్య ఛేదనలో చతికిల

రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల కఠినమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ప్రత్యర్థి బౌలర్లు ఆదిలోనే భారీ షాక్ ఇచ్చారు. లక్ష్య ఛేదనలో కావాల్సిన రన్ రేట్ చాలా ఎక్కువగా ఉండటంతో ముంబై బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు పారేసుకున్నారు. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ కేవలం 8 బంతుల్లో 25 పరుగులు చేసి కాసేపు ఆశలు రేపినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. నమన్ ధీర్ 13 బంతుల్లో 25 పరుగులు, తెలుగోడు తిలక్ వర్మ 10 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో కనీసం నిలదొక్కుకోలేకపోవడంతో ముంబై నిర్ణీత 11 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. కట్టుదిట్టమైన బౌలింగ్ రాజస్థాన్ బౌలర్లు అత్యద్భుతమైన ప్రణాళికతో బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నాంద్రే బర్గర్ 2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ సైతం 2 ఓవర్లలో 25 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. అనుభవజ్ఞుడైన పేసర్ సందీప్ శర్మ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లతో ముంబై పతనాన్ని శాసించాడు. బౌలర్లందరూ సమిష్టిగా రాణించడంతో రాజస్థాన్ రాయల్స్ మరో అద్భుత విజయాన్ని అందుకుని పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

# సిడ్నీ వీధుల్లో 'వార్నర్' స్కిడ్..

**సిడ్నీ:** మైదానంలో బౌలర్ల గుండెల్లో వణుకు పుట్టించే ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్, 'డేవిడ్ భాయ్'గా పిలుచుకునే డేవిడ్ వార్నర్ ఇప్పుడు పోలీసులకు చిక్కారు. అది కూడా మద్యం మత్తులో కారు నడుపుతూ అడ్డంగా దొరికిపోయారు. సిడ్నీలోని మరౌబ్రాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నుండి తప్పించుకోవాలని వార్నర్ వేసిన 'మాస్టర్ ప్లాన్' రివర్స్ కావడంతో ఆయన కటకటాల వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

- మద్యం మత్తులో చిక్కిన క్రికెట్ దిగ్గజం!
- రెండింతలు దాటిన ఆల్కహాల్ రీడింగ్
- పోలీసులను చూసి కారు పార్క్ చేసినా దొరికిపోయిన డేవిడ్ భాయ్
- పీఎస్ఎల్ ఆడే అవకాశంపై నీలినీడలు



### అసలేం జరిగిందంటే?

సిడ్నీలోని మరౌబ్రా ప్రాంతంలో న్యూ సౌత్ వేల్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం సాధారణ తనిఖీలు చేపట్టారు. అయితే, పోలీసుల తనిఖీ కేంద్రాన్ని దూరం నుండే గమనించిన వార్నర్, పట్టుబడకుండా ఉండేందుకు తన కారును కొంచెం దూరంలోనే నిలిపివేసి పార్క్ చేశాడు. వార్నర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే కారు వద్దకు వెళ్లి ఆయనకు శ్వాస పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఆయన మద్యం సేవించినట్లు తేలడంతో పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

### రెండింతలు దాటిన రీడింగ్

మరౌబ్రా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రెండో పరీక్షలో వార్నర్ రక్తంలో ఆల్కహాల్ శాతం 0.104 గా నమోదైంది. ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం ఉండాల్సిన పరిమితి కంటే ఇది రెండింతలు ఎక్కువ. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ, వచ్చే మే 7వ తేదీన ఆయన సిడ్నీలోని డౌనింగ్ సెంటర్ లోకల్ కోర్టులో హాజరుకావాల్సి ఉంది.

### పీఎస్ఎల్ ఆడేనా?:

ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్ 2026)లో కరాచీ కింగ్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్న వార్నర్, ఈస్టర్ సెలవుల నిమిత్తం స్వదేశానికి వచ్చారు. గురువారం పెషావర్ జల్మీతో జరగనున్న మ్యాచ్ కోసం ఆయన తిరిగి పాకిస్థాన్ వెళ్లాల్సి ఉంది. అయితే ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలు ఉండటంతో ఆయన పీఎస్ఎల్ లీగ్‌లో తిరిగి ఆడతారా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. కరాచీ కింగ్స్ కెప్టెన్ ఇలా వివాదంలో చిక్కుకోవడంతో ఆ జట్టు యాజమాన్యం కూడా పునరాలోచనలో పడింది.





# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

**విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై**

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.






# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**